ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు


దేవరకద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: ప్రభుత్వ దవాఖానాలలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో వైద్య రంగంలో అనేక మార్పులు వచ్చాయని కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ దవాఖానాలు పని చేస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి సీఎం వైద్యం, ఆరోగ్య రంగాలపై పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కొత్త కొత్త పథకాలు ప్రవేశ పెట్టారని అన్నారు. పేదలకు అండగా ఉంటూ సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎల్‌ఓసీలు అందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగాంగ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని దేవరకద్ర నియోజకవర్గంలోని 80 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఎంపీపీలు రమాదేవి, కదిరె శేఖర్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాగార్జునరెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైటెన్షన్ వైర్లు తొలగించాలని వినతి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు ఎర్రసత్యం కాలనీలో ఉన్న హైటెన్షన్ వైర్లు తొలగించాలంటూ కమిషనర్ మహమూద్‌షేక్, ఏడీ శ్రీనివాసులుకు బుధవారం కాలనీ వాసులు వినతిపత్రాలు సమర్పించారు. 30ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్నామని, హైటెన్షన్ వైర్ల వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని ఏఈకి విన్నవించారు. ఇళ్ల పైనుంచి వైర్లు వెళ్తుండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నామని, పరిష్కరించాలని కోరారు.

‘కల్యాణలక్ష్మి’ చెక్కుల పంపిణీ



కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మురళీ, నాయకులు భీంరెడ్డి, రాము, మొగులయ్య, ఆంజనేయులు, రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌ఓ) ఆధ్వర్యంలో పోరాటయోధుడు చెగువేరా జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రం రైల్వే స్టేషన్ రోడ్డులోని బుద్ధభవన్‌లో యువతకు చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌ఓ నాయకులు జగపతిరావు పాల్గొని మాట్లాతూ చెగువేరాను స్ఫూర్తిగా తీసుకొని యువత సమాజ మార్పు కోసం కృషి చేయాలని కోరారు. చెస్ పోటీల్లో శివకుమార్, మునీర్, విశ్వచరణ్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలవగా వీరికి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రవీణ్‌కుమార్, వి.కురుమూర్తి, విజయ్‌కుమార్, ఎస్.కురుమూర్తి, ఖయ్యుం, ఖాజమైనద్దీన్, రవికిరణ్, గోపాల్, చెస్ పోటీల సమన్వయకర్త ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో డాక్టర్లు సిబ్బందికి గౌరవం


ఆరోగ్య మహిళ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: స్వరాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బందికి తగిన గౌరవం తీసుకువచ్చామని వైద్య ఆరోగ్యశాఖ మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని చంద్రగార్డెన్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్యశాఖ ప్రగతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వాల హయాంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది అంటే సక్రమంగా పనిచేయరనే భావన ప్రజల్లో ఉండేదని, ఇప్పుడా పరిస్థితి పోయిందన్నారు. సీఎం కేసీఆర్ ఉన్నత ఆశయాలకు అనుగుణంగా వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి ఎంతో ప్రగతి సాధించామన్నారు. గతంలో నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అన్న పాటలు పుట్టాయని ఇపుడైతే నేను సర్కారు దవాఖానకు వస్తా అంటూ ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 100పడకల ఏరియా ఆస్పత్రి ప్రారంభించుకున్నామన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని స్థానికంగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఆశ కార్యకర్తలకు వేతనం పెంచామని వివరించారు. ఆరోగ్య మహిళ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో ఉత్తమ వైద్యుడు డా.శివకాంత్, ఫార్మసిస్ట్ బాలు, ల్యాబ్‌టెక్నీషియన్ వినోద్, స్టాఫ్‌నర్స్ ప్రశాంతి, ఏఎస్ఎం శ్రీదేవిలకు అవార్డులను అందజేశారు.

మున్సిపాలిటీ ఆవరణలో ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ ప్రదీప్‌కుమార్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు వివిధ అంశాలపై అందరినీ ఆకట్టుకునేలా వివిధ రూపాల్లో రంగులతో ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. వీటిని ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్ కుమార్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ పరిశీలించారు. కాగా, ఈనెల 16న ముగ్గుల పోటీల విజేతలను అధికారులు ప్రకటించనున్నారు. అదే రోజు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా మొదటి, రెండు, మూడు బహుమతులతో పాటు మరో రెండు కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాణీకుమారి, రవీందర్‌రెడ్డి, గురుప్రసాద్, ఆర్‌పీలు, సీసీలు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలని ధర్నా

మహబూబ్‌నగర్ రూరల్: క్రిష్టియన్‌పల్లి శివారు 523 సర్వేనంబర్‌లో ఇళ్ల పట్టాలు కలిగిన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి మాకం రాంమ్మోహన్ మాట్లాడుతూ క్రిష్టియన్‌పల్లి శివారులో 20 ఏళ్ల క్రితం నిరుపేదల కోసం అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు అనువుగా లేకపోవడంతో ప్రజలు కట్టుకోలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు ఇచ్చిన స్థలాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిందని , ఇదేమిటని ప్రశ్నించిన స్థలాలు కలిగిన పేదలకు దివిటిపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న డబుల్ ఇళ్లను కేటాయిస్తామని అప్పట్లో చెప్పారని అన్నారు. తీరా దివిటిపల్లిలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక స్థలాలు కోల్పోయిన వారికి కాకుండా అధికారులు ఇతరులకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇకనైనా న్యాయం చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో మహిళా సమాఖ్య నాయకురాలు చెన్నమ్మ, పార్వతమ్మ, గోవిందమ్మ, కృష్ణవేణి, అరుణ, లలిత, పి.లక్ష్మమ్మ, మల్లేశ్వరీ, పద్మ, సవితదేవి, మంజుల, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


లాల్‌కోట గ్రామంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): విత్తనాలు, ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని విత్తన, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను ఏఓ శ్యామ్‌యాదవ్‌తో కలిసి ఆయన బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులతో పాటు బిల్ బుక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ నిషేధిత ఎరువులు, విత్తనాలు, గడ్డి, పురుగు మందులు అమ్మకూడదని అన్నారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల వివరాలు నోటీసు బోర్డుపై రోజువారీగా రాయాలని అన్నారు. రైతులకు రశీదు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను విక్రయించొద్దని అన్నారు.

దేవరకద్ర: పత్తి విత్తనాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన దేవరకద్రలోని పలు విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కువకు ధరలకు విక్రయిస్తే సీడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏడీఏ యశ్వంత్‌రావు, ఏఓ రాజేందర్ అగర్వాల్ తదితరులున్నారు.

చిన్నచింతకుంట: జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేష్ బుధవారం మండలంలోని బండర్‌పల్లి, లాల్‌కోట గ్రామాలలో విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్నతోపాటు పలువురు ఉన్నారు.

జడ్చర్ల: జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ బుధవారం జడ్చర్లలోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పద్యనాటక ప్రదర్శనలు


శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని ఓ సన్నివేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపల్ టౌన్‌హాల్‌లో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న పద్య నాటక ప్రదర్శనలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీచంద్రముఖి ఆర్ట్స్ అకాడమీ శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీకృష్ణ రాయబారం నాటక ప్రదర్శన, అల్లూరి సీతారామరాజు, మాయలపకీరు ఏకపాత్రాభియనయం, శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టం నాటకాలను ప్రదర్శించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళారంగాన్ని బతికించుకోవాలన్న సంకల్పంతో ఏళ్లుగా నాటకాలు ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. తాను సాంస్కృతిక శాఖ చేపట్టాక సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్రను నాటకంగా వేయించినట్లు వివరించారు. కళాకారులను ఘనంగా సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సిములు, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, శ్రీమిత్ర కళానాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు వి.మనోహర్‌రెడ్డి, నారాయణ, ప్రభాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి


నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్/భూత్పూర్ : క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పలు మండలాలకు సంబంధించి మహిళా విభాగం నూతన అధ్యక్షులను నియమించారు. భూత్పూర్ మండల అధ్యక్షురాలిగా సరితారెడ్డి, భూత్పూర్ పట్టణ అధ్యక్షురాలిగా కె.పద్మ, చిన్నచింతకుంట మండల అధ్యక్షురాలిగా వరలక్ష్మి, దేవరకద్ర మండల అధ్యక్షురాలిగా ఎం.సుగుణలకు వసంత నియామకపత్రాలు అందజేశారు. నూతన అధ్యక్షులకు డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

కిలో వెండి బహూకరణ



అడ్డాకుల: కందూర్ రామ లింగేశ్వరస్వామి ఆలయానికి కర్ణాటకలోని రాయచూర్ ప్రాంతానికి చెందిన సత్యారం రమేష్ కుమారుడు వినయకృష్ణ, సత్యారం వేదాంశ్ కృష్ణ పేరుపై కిలోవెండి బుధవారం బహూకరించారు. ఈ మేరకు స్వామి వారు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు కిరీటాలు, కంఠాభరణము చేయించడానికి వెండి అందజేశారని నిర్వాహకులకు తెలిపారు. ఈ మేరకు దాతలను ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జడ్చర్ల: ఎలాంఇ అనుమతి లేకుండా అక్రమంగా దుందుబీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం జడ్చర్ల పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ లెనిన్ మాట్లాడుతూ డ్రైవర్ బాలరాజుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన చంద్రమ్మ అనారోగ్యానికి గురై బుధవారం మృతి చెందింది. జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.5 వేలను పంపడంతో వాటిని బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ ఖాజాఘోరీ, యూత్ అధ్యక్షులు బాలరాజు, మల్లికార్జున్, శ్రీనివాస్‌గౌడ్, జానకిరాములు, కుమ్మరి శ్రీను, మనోహర్ తదితరులు ఉన్నారు.

గొర్రెలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

దేవరకద్ర: గుడిబండ గ్రామానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు, చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లి గ్రామానికి చెందిన మరో ఆరుగురికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 101 కోట్ల వ్యయంతో 5,767 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీపీ రమాదేవి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

మిడ్జిల్: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మిడ్జిల్‌కు చెందిన భాస్కర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా బుధవారం మధ్యాహ్నం జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై మన గ్రోమోర్ వద్ద బైక్ అదుపుతప్పింది. ఈ క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భూత్పూర్: పట్టణంలోని నూతనంగా పోచమ్మ ఆలయం నిర్మాణం కోసం చైర్మన్ బస్వరాజ్ గౌడ్ బుధవారం భూమిపూజ చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మంజునాథ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రమౌళి, నాయకులు తదితరులు ఉన్నారు.

నవాబుపేటకు రెండు అవార్డులు

నవాబుపేట: జడ్చర్ల నియోజకవర్గం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవంలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రెండు అవార్డులు లభించాయి. స్టాఫ్‌నర్స్ విభాగంలో ప్రశాంతికి, ల్యాబ్‌టెక్నీషియన్ విభాగంలో వినోద్ అవార్డులు గెలుచుకున్నారు. ఈ మేరకు జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మండల అధికారుల సమక్షంలో వారికి అవార్డులు అందించి, అభినందించినట్లు మండల వైద్యాధికారిని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.

నేడు పల్లె ప్రగతి

నవాబుపేట: దశబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ పల్లెప్రగతి దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీలత బుధవారం తెలిపారు. గ్రామాల్లో సభలు, ర్యాలీలు, సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని కార్యక్రమాలు విజయవంతం చేయాలని సూచించారు.

మహమ్మదాబాద్: పల్లె ప్రగతి కార్యక్రమం ప్రతిగ్రామంలో గురువారం నిర్వహించాలని ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ, గ్రామ సభలు, సన్మానం వంటివి చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని మణికొండలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. 32 మంది విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించి 1వ తరగతిలో చేర్పుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాంద్‌పాష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు వంటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఎస్.వెంకటేష్, విజయభాస్కర్‌రెడ్డి, శ్యాంబాబు, కవితాదేవి, గాయత్రి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అడ్డాకుల: వాల్మీకి బోయలను ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎంబీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. మూసాపేట మండల వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ మంజులను కలిసి వినతిపత్రం అందజేశారు. కులవృత్తి లేని తమకు కూడా రూ.లక్ష రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, అచ్చాయపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, కొండయ్య, దాసర్‌పల్లి రాజు, రవి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

మహమ్మదాబాద్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిచడమే లక్ష్యంగా పాఠశాలలు పనిచేయాలని మండల కోఆప్షన్ సభ్యుడు సలీం తెలిపారు. నంచర్లగేట్ (దేశాయిపల్లి)లో ఓ ప్రైవేట్ పాఠశాలను ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

పండుగలతో ప్రేమ, ఆప్యాయతల వృద్ధి

బాలానగర్: గ్రామస్తులందరూ కలిసికట్టుగా చేసే వేడుకల్లో బొడ్రాయి పండుగ ముఖ్యమైందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గాలిగూడలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బుధవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలతో గ్రామాల్లో ప్రేమ, ఆప్యాయతలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. జెడ్పీటీసీ కల్యాణి, వైస్ ఎంపీపీ వెంకటచారి, సర్పంచ్ రాంరెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన స్వామి వివేకానంద సేవ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్. రామకృష్ణ 54 సార్లు రక్తదానం చేసి 28 సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకుగాను అవార్డును అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై అవార్డులు ప్రదానం చేశారు.

పాలమూరు: అత్యధిక సార్లు రక్తదానం చేసినందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్‌కు గవర్నర్ తమిళిసై అంతర్జాతీయ లైఫ్ సేవర్ అవార్డును అందజేశారు. నటరాజ్ ఇప్పటి వరకు 154సార్లు రక్తదానంతో పాటు ఆరుసార్లు ప్లాస్మా, ఆరుసార్లు ప్లేట్ లెట్స్ దానం చేశారు.

నీట్‌లో 495వ ర్యాంకు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌కి చెందిన విద్యార్థిని కాదాంబరి నీట్ పరీక్ష ఫలితాల్లో 495వ ర్యాంకు సాధించింది. గ్రామానికి చెందిన ఆలయ పూజారి రవీందర్, మణెమ్మ దంపతుల కుమార్తె అయిన కాదాంబరికి నీట్ పరీక్షలో 720 మార్కులకు గాను 695 మార్కులు వచ్చాయి. ఆలిండియా ర్యాంకు సాధించిన విద్యార్థిని బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

వేడుకగా బొడ్రాయి పతిష్ఠ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ఓబ్లాయిపల్లిలో జరిగిన బొడ్రాయి, బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరు కాగా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ కె.అనిత, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్ చంద్రకళ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు (రూ.2 లక్షలు) బుధవారం క్రిష్టియన్‌పల్లికి చెందిన శోభారాణికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు.

భూతగాదాల్లో కేసునమోదు

మహమ్మదాబాద్: ఇరువర్గాల మధ్య ఉన్న భూతగాదాలతో దాడికి పాల్పడిన వారిపై కేసునమోదు చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. వెన్నాచేడ్ గ్రామానికి చెందిన బలిజ ఈశ్వరయ్యకు కప్లాపూర్ శివారులో ఎకరా పొలం ఉంది. అదే గ్రామానికి చెందిన సంపల్లి వెంకటయ్యకు కూడా దాని పక్కనే పొలం ఉంది. ఇరువురి మధ్య ఒక ఎకరం పొలం విషయమై తగాదాలు నడుస్తున్న క్రమంలో బుధవారం వెంకటయ్య కుటుంబీకులు వెళ్లి పొలం దున్నిస్తుండగా ఈశ్వరయ్య దంపతులు వెళ్లి అడిగారు. దీంతో వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.